మెరుగైన వసతుల కల్పనకు కృషి

ఎమ్మెల్యే వివేకానంద్


ఎమ్మెల్యే వివేకానంద్‌కు సమస్యలను వివరిస్తున్న సంక్షేమ సంఘం ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: ప్రజలకు మెరుగైన వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం పేట్ బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలను వివరించారు. తాగునీటి పైపులైన్‌లు, రోడ్లు వేయాలని విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెండింగ్ పనులతో పాటు కొత్త అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ఆదేశించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


బోరును ప్రారంభిస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లో నెలకొన్న నీటి సమస్యపై హన్మంతరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడి స్పెషల్ ఫండ్స్ ద్వారా బోరు వేయించారు. శుక్రవారం సదరు బోరును ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఎండీ లాయక్, సమీర్ షఫీ, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసరావు, అజయ్, వంశీ, మహేష్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై దృష్టి..!

- చెత్త సేకరణలో ర్యాంకులు సాధించటంపై దృష్టి
- తడి, పొడి చెత్తను విడివిడిగా వేసేలా అవగాహన కార్యక్రమాలు
- ముందస్తు ప్రణాళికలతో అధికార యంత్రాంగం





సాక్షి,సిటీబ్యూరో: స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులు సాధించేందుకు నగర శివారు పురపాలక సంఘాలు దృష్టి సారిస్తున్నాయి. గతంలో కంటే మెరుగ్గా రాణించేలా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో వేసి ఇవ్వాలని ప్రజలకు సూచించినా.. పురపాలికల్లో 60 నుంచి 70 శాతమే ఇస్తున్నట్లు క్షేత్ర స్థాయి పరిశీలనలో వెల్లడవుతోంది. కొన్ని పురపాలక సంఘాల్లోనైతే అసలే పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు తప్పటం లేదని తెలుస్తోంది. ఫలితంగా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకుల సాధించటంలో పలు పురపాలక సంఘాలు వెనుకబడిపోతున్నాయి. ఈ ఏడాది అలాంటి విధానానికి భిన్నంగా పుర అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇదంతా డిసెంబర్ వరకు కొనసాగనుంది.

డివిజన్లు/వార్డుల వారీగా ..

నగర శివారు మేడ్చల్‌-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 29 పురపాలికల్లో 675 డివిజన్లు/ వార్డుల వారీగా ఇక నుంచి చైతన్య కార్యక్రమాలు నిర్వహించటానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నారు. తడి, పొడి చెత్తను ఎలా వేరు చేయాలో ప్రత్యేకంగా చూపించటంతో పాటు కరపత్రాలు, బ్రోచర్లను ఇంటింటికీ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. భూమిలో కలిసిపోయే కూరగాయలు, ఇతర వ్యర్థాలు, కుళ్లిన పండ్లు, ఇంట్లో మిగిలిన ఆహార పదార్థాలను ఒక డబ్బాలో వేయాలని సూచించనున్నారు. ప్లాస్టిక్ డబ్బాలు, సీసాలు, ఇనుప ముక్కలు, కాగితాలు, అట్టలు ఇతర పొడి వ్యర్థాలను మరో డబ్బాలో వేయాలని నిర్దేశించనున్నారు. పురపాలికల్లోని ప్రధాన రోడ్ల వెంబడి హోర్డింగులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇంట్లో ఉత్పత్తి అయిన చెత్తాచెదారాన్ని రోడ్లపై, ఖాళీ స్థలాల్లో పారేయకుండా అవగాహన కల్పించనున్నారు. పరిసరాల శుభ్రతపై విద్యా సంస్థల్లో పలు చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మార్పు రావాలనే ఉద్దేశంతో...

స్వచ్ఛతకు వినియోగించే పురపాలిక వాహనాలు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు పారిశుద్ధ్య సిబ్బంది ఒకే డబ్బాలో చెత్త ఇవ్వకుండా అవగాహన కల్పించనున్నారు. అపార్టుమెంట్లు, కాలనీలు, గ్రేటెడ్ కమ్యూనిటీ ఏరియాలు, పారిశ్రామిక ప్రాంతాలు, ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రజల్లో విస్తృతంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా చెత్త సేకరణ విషయంలో మార్పు తీసుకురావాలని పురపాలక తగిన కార్యాచరణతో ముందుకు సాగేందుకు కసరత్తు చేస్తున్నారు.

మెరుగైన ర్యాంకు లక్ష్యంగా ..

స్వచ్ఛ సర్వేక్షణ్ లో ఈసారి అవార్డు వచ్చేలా పురపాలక సంఘాలు పోటీ పడుతున్నాయి. గతంలో కంటే మెరుగైన ర్యాంకు సాధించిన పురపాలికలు రాష్ట్ర స్థాయిలో పోటీ పడేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లేందుకు కసరత్తు చేస్తున్నాయి. పట్టణ ప్రజలు కూడా చెత్త విషయంలో నిబంధనలు పాటించి తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని కోరుతున్నారు. పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తే ర్యాంకు తప్పక వస్తుందన్న పట్టుదలతో ముందడుగుకు సిద్ధమవుతున్నారు.

రాజీవ్ గృహకల్పకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలి


డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజాంపేట్: నిజాంపేట్ రాజీవ్ గృహకల్పకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం కూకట్‌పల్లి డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజీవ్ గృహకల్ప పరిసర కాలనీల్లో 30 వేల కుటుంబాలు నివసిస్తున్నాయని, విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే బస్సు సదుపాయం లేక కాలినడక అర కిలోమీటర్ మేర నడవాల్సి వస్తోందన్నారు. డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించారని నేతలు తెలిపారు. కార్యక్రమంలో రామచంద్రనాయక్, సరళ, లక్ష్మణ్, పితాని శ్రీనివాసులు, సరితారెడ్డి, రాణి, సుమతి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబుకు సన్మానం


మంత్రికి సన్మానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని అలీప్ మహిళా పారిశ్రామిక వాడలో కార్యక్రమానికి శుక్రవారం హాజరైన మంత్రి శ్రీధర్ బాబుకు కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలను గోపాల్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్లు సురేశ్‌రెడ్డి, ఇంద్రజిత్ రెడ్డి, నాయకులు జగన్ యాదవ్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై అభ్యర్థనలు ఇవ్వండి

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణలో స్థానిక సంస్థల్లో కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఆసక్తి కలిగిన పార్టీలు, ప్రజల నుంచి వినతులు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను స్వీకరించాలని నిర్ణయించినట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి ఇందిర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 13 వరకు అన్ని పని దినాల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఖైరతాబాద్‌లోని రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయంలో వినతులు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను దాఖలు చేయాలని సూచించారు. అలాగే తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుల బృందం 7న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ విచారణ జరుపుతుందన్నారు. ఇందులో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బీసీ వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం తదితరులు పాల్గొంటుందన్నారు.

పశుగణన ప్రారంభించిన కలెక్టర్ గౌతమ్



సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వ పాడి, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 21వ అఖిల భారత పశుగణనలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో పశుగణన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ గౌతమ్ ప్రారంభించారు. నాలుగు నెలల పాటు తలపెట్టిన పశుగణన కార్యక్రమంలో పాడి పశువులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, కుక్కలు, కోళ్లతో సహా 16 రకాల జంతువుల లెక్కను పక్కాగా సేకరించనున్నారు. ప్రతి ఐదేళ్లకు ఓసారి దేశ వ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో తాజా లెక్కలను కచ్చితంగా గణన చేయడానికి మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 15 మండలాల్లో సంబంధిత అధికారులు తగిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. పశుసంవర్ధక శాఖ అధికారులు సిబ్బందితో పాటు గోపాల మిత్రులు, ఇతర ఔట్ సోర్సింగ్ సిబ్బంది కూడా ఈ గణనలో భాగస్వామ్యాన్ని పంచుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పక్కాగా పెంపుడు జంతువుల వివరాలు నమోదు చేయడానికి సిబ్బంది ఇంటింటికి వస్తారని, ప్రజలందరూ సహకరించాలని కలెక్టర్ గౌతమ్ కోరారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. సుధాకర్, సహాయ సంచాలకుడు డా. ప్రభు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన బీజేపీ నేతలు



జగద్గిరిగుట్ట: మూసీ బాధితులకు బీజేపీ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్ అన్నారు. ఇందిరాపార్క్ వద్ద మూసీ బాధితులు నిర్వహిస్తున్న ధర్నాకు సంఘీభావంగా శుక్రవారం తరలివెళ్లారు. కార్యక్రమంలో రాజు యాదవ్, రాజేందర్ రెడ్డి, శ్రీహరి, సత్తి యాదవ్, వరలక్ష్మి, పుష్ప, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రంలో కలెక్టర్ తనిఖీ



దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న గ్రూప్ 1 పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. పరీక్ష ప్రశాంతంగా జరుగుతుందా, సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా? అన్న విషయాలను దగ్గరుండి పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మతిన్, సంబంధిత అధికారులు ఉన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి చేయూత


ఆర్థికసాయం అందజేస్తున్న ఆటో డ్రైవర్లు

సుభాష్‌నగర్: దూలపల్లిలో ఆటో డ్రైవర్ మహేష్ అనారోగ్యంతో మృతి చెందడంతో అతని కుటుంబానికి తోటి ఆటో డ్రైవర్లు అండగా నిలిచారు. ఆటో స్టాండు, అడ్డా కమిటీ ఆధ్వర్యంలో సేకరించిన రూ.10 వేల నగదును మృతుడి కుటుంబానికి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో టీయూసీఐ కుత్బుల్లాపూర్ ఉపాధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, నాయకులు మధు, జక్కి రాజు, వెంకట్‌రెడ్డి, ముజామిల్ పాల్గొన్నారు.

విష వాయువులతో ఉక్కిరిబిక్కిరి

జీడిమెట్ల: ఓ పరిశ్రమ నుంచి రసాయన వాయువులు వెలువడటంతో స్థానిక ప్రజలు కళ్లమంటలతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జీడిమెట్ల ఫేజ్‌-3 లోని వాటర్ బోర్డు కార్యాలయం సమీపంలో ఓ పేరులేని పరిశ్రమ నుంచి శుక్రవారం సాయంత్రం ఘాటైన రసాయనాల వాయువులు బయటకు వెలువడ్డాయి. ఒక్కసారిగా దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. సాయంత్రం కావడంతో రోడ్డుపై వెళ్లే ప్రజలు, కార్మికులు కళ్లమంటలతో అక్కడ నుంచి పరుగులు తీశారు. అసలు ఏం జరుగుతుందో అర్థంగాక ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. కొంతమంది ఘాటైన దుర్వాసనకు వాంతులు చేసుకున్నారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న జీడిమెట్ల పోలీసులు పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. పొగలు వస్తున్న పరిశ్రమను గుర్తించి దగ్గరకు వెళ్లి గేట్లు తెరవాలని కోరగా.. పరిశ్రమ సిబ్బంది పట్టించుకోనట్లు వ్యవహరించారు. పరిశ్రమ లోపల పైపుల నుంచి రసాయనాలను రిలీజ్ చేసే పైప్‌లైన్‌లో మోటార్ ఆగిపోవడం వల్ల వాయువులు బయటకు వెలువడ్డాయని సమాచారం.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ సందర్భంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని పేట్‌బషీరాబాద్ ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ బాలాజీ ఆసుపత్రి ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు కాస్ హోటల్, ఎస్‌జీపీ గ్రాండ్, సెరియా అవెన్యూ గేట్ 1, 2, 3, అంగడిపేట్ గ్రామం, కాంటన్ పార్క్, 11కేవీ జయరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జయరామ్‌నగర్, రుక్మిణి ఎస్టేట్స్, గణేష్ కాలనీ, శ్రీకృష్ణ నగర్, జీకే నగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నిజాంపేట్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు సందర్భంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ప్రగతినగర్ ఏఈ జ్ఞానేశ్వర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ జేఎన్‌యూఆర్‌ఎం ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు సాయికృష్ణ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, లహరీగ్రీన్ పార్కు, 11కేవీ జగన్ స్టూడియో ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్‌ఆర్‌ఐ కాలనీ, విష్ణుప్రియనగర్, అక్షర స్కూల్ ఏరియా, విస్టా విల్లాస్, 11కేవీ ఆర్‌కేజీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు వాసవీ లేఅవుట్, న్యూ విజేత సూపర్ మార్కెట్, రాజీవ్ గృహకల్ప రోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి


అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో పలు సంక్షేమ సంఘాల నేతలు వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని, అదే విధంగా సమస్యల ప్రాంతాలను పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

నేడు ఉచిత మెడికల్ క్యాంప్

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ బాలయ్యనగర్‌లో శనివారం మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నారు. వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగే శిబిరంలో బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, జ్వరం, చర్మ సంబంధిత వ్యాధులు, రక్త పరీక్షలు, ఎక్స్‌రే, స్కానింగ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నారని బస్తీ అధ్యక్షుడు నాగేష్ తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులను అందజేస్తున్న శంభీపూర్ కృష్ణ తదితరులు

దుండిగల్: అర్హులందరూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ద్వారా 35 మందికి రూ.13.14 లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఆ చెక్కులను శుక్రవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయి యాదవ్, భరత్ కుమార్, విష్ణు వర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా..

- ఇంటి అనుమతులతో కమర్షియల్ నిర్మాణాలు
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి
- అక్రమార్కులకు నోటీసులతోనే సరి


దూలపల్లి చౌరస్తాలో నిర్మాణంలో ఉన్న గోదాం


దూలపల్లి ప్రధాన రోడ్డు పక్కన అనుమతికి మించి నిర్మిస్తున్న భవనం

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలో అక్రమ నిర్మాణాలకు అంతే లేకుండా పోయింది. అనుమతులు ఒకలా తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు మరోలా చేపడుతున్నారు. అలాంటి నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవాల్సింది పోయి అక్రమ నిర్మాణాలదారులకే వత్తాసు పలుకుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దూలపల్లి - కొంపల్లి ప్రధాన రోడ్డును ఆనుకొని కొంత మంది ఇంటి నిర్మాణం కోసం అనుమతి తీసుకుని కమర్షియల్ నిర్మాణాలు, మరి కొందరు గోదాములు నిర్మిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రధాన రోడ్డు పక్కనే ఇంత జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. అక్కడక్కడ నిర్మాణదారులకు టౌన్ ప్లానింగ్ అధికారులు కేవలం నోటీసులతో సరిపెడుతున్నారు. తరువాత ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ముగ్గురు చైన్‌మెన్లు ఉన్నా..

టౌన్ ప్లానింగ్ విభాగంలో దూలపల్లిలో ముగ్గురు చైన్‌మెన్లు పని చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారుల దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్లాలి. కానీ ఆ దిశగా అధికారులు, సిబ్బంది పని చేయడం లేదు అనడానికి దూలపల్లి చౌరస్తాలో చేపడుతున్న గోదాము, హై టెన్షన్ వైర్ల కింద పూర్తవుతున్న నిర్మాణాలే ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇక సంబంధిత అధికారులు అక్రమ నిర్మాణాలకు చెక్ పెడతారో?, వారికి వత్తాసు పలుకుతారో? చూడాల్సిందే మరి.

చర్యలు తీసుకుంటాం



నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలకు ఇటీవలే నోటీసులు అందజేశాం. పనులను కూడా నిలిపివేశాం. అలాంటి నిర్మాణదారులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. మరోసారి నోటీసులు అందజేసి తక్షణమే చర్యలు తీసుకుంటాం.

– శ్రీహరి, కొంపల్లి మున్సిపల్ కమిషనర్

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

- సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- బీఆర్‌ఎస్ పాలనలోనే నియోజకవర్గం అభివృద్ధి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


బీఆర్‌ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: ప్రజల బాగోగులను పట్టించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉండి సమస్యల పరిష్కారానికి దృష్టి సారించాలని సూచించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో కేపీహెచ్‌బీ డివిజన్‌కు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో ముఖ్యమంత్రిగా కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజలు మర్చిపోలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో నగరంలోని అన్ని రంగాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనుల నిర్వహణకు ఒక్క రూపాయి కూడా వెచ్చించలేని స్థితికి జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలు చేరాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో వేల కోట్ల రూపాయలతో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకున్నామని గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా మళ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందటం ఖాయమన్నారు. ఎక్కడ ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ రాజేష్, సాయిబాబు, నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధోబీఘాట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

కేపీహెచ్‌బీ డివిజన్ 7వ ఫేజ్‌లోని ధోబీ ఘాట్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో డివిజన్‌లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. పార్కులు, ఫ్లైఓవర్‌లు, ఇండోర్ స్టేడియాలు వంటి సదుపాయాలను ప్రజలకు అందించామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, డీఈ శ్రీదేవి, ఏఈ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

కబ్జా చేస్తే చర్యలు తప్పవు

ప్రశాంత్ నగర్ పాత కోర్టు భవనం ఎదురుగా ఉన్న శ్మశానవాటిక స్థలాన్ని కొందరు కబ్జా చేస్తున్నట్లు దయార్‌గూడ బస్తీవాసులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన శుక్రవారం స్థానికులు, బస్తీ వాసులతో కలిసి శ్మశాన వాటికను పరిశీలించారు. సర్వే నెం 200లలో సుమారు ఐదు ఎకరాలకు పైగా భూమిని శ్మశాన వాటిక కోసం వదలినట్లు రెవెన్యూ రికార్డులు ఉన్నాయని తెలిపారు. కబ్జాదారులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రశాంత్‌నగర్ ప్రాంతంలో నాలాలు, శ్మశాన వాటికలను కబ్జా చేస్తున్న వారిపై మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.